క్లుప్తంగా

బాలికల చట్టాలపై అవగాహన

కిర్లంపూడి: బాలికల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్పీలు పి.శశికళ దేవి, ఆనందకుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశం హాలులో ఎంఈఓలు టి.జోషఫ్, ఎం.చిన్నారావు అధ్యక్షతన మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలకు, విద్యార్థులకు మంగళవారం పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించేందుకు పోక్సో చట్టం అమలులోకి వచ్చిందన్నారు. పోక్సో చట్టంలోని పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు రక్షణ కల్పించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

పింఛన్ల పంపిణీ

గండేపల్లి: మండలంలో పింఛన్లు పంపిణీ 95.5 శాతం పూర్తయినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. 8406 లబ్ధిదారులకు గాను రూ.3,60,77,000లను అందజేసినట్టు తెలిపారు. పింఛన్లు పంపిణీలో గండేపల్లి మండలం జిల్లాలో మూడో స్థానంలో ఉన్నట్టు పేర్కొన్నారు.

తుని మండలంలో 94.57 శాతం

తుని రూరల్: మండలంలో 94.57శాతం సామాజిక పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.సాయి నవీన్ తెలిపారు. జనవరి ఒకటి నూతన సంవత్సరం కావడంతో ఒక రోజు ముందుగానే మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 27 సచివాలయం పరిధిలో 12188 మంది పింఛనుదారులు ఉండగా 11526 మందికి రూ.4,94,95,000 నగదును పంపిణీ చేసినట్టు ఆయన వివరించారు.

ప్రత్తిపాడులో 85 శాతం

ప్రత్తిపాడు: మండలంలో మంగళవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ 85 శాతం పూర్తయిందని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో 11,570 మంది పింఛనుదారులుండగా సాయంత్రానికి 9,835 మందికి సచివాలయాల సిబ్బంది పంపిణీ చేశారన్నారు.

రెవెన్యూ సదస్సుకు 18 అర్జీలు

తొండంగి: యర్రయ్యపేటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 18 దరఖాస్తులందాయని తహసీల్దార్ మురార్జీ తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలు, భూములకు సంబంధించిన మ్యుటేషన్లు, కుల, ఆదాయ ధృవీకరణ తదితర వాటి మంజూరుకు దరఖాస్తులందాయన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

హెడ్‌మాస్టర్‌కు సత్కారం

జగ్గంపేట: రాజపూడి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ పొందిన సాల్మన్‌రాజును గ్రామ ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంలో ఆయన చేసిన కృషిని పలువురు కొనియాడారు. గ్రామ సర్పంచ్ బూసాల విష్ణు, టీడీపీ నేతలు మారిశెట్టి భద్రం, రేకా బులిరాజు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానంపై అవగాహన



జాతీయ విద్యా విధానంపై విద్యార్థులకు వివరిస్తున్న ధానే

తుని: సంపూర్ణ మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు నిష్పాక్షికమైన, న్యాయమైన సమాజ స్థాపనకు, జాతీయ అభివృద్ధి వైపు తీసుకువెళ్లేందుకు విద్య మౌలికమైందని అకాడమీ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రొఫెసర్, డీన్ ధానే, రిటైర్డ్ సైంటిస్ట్ బాబా సైన్స్ సెంటర్ డాక్టర్ సుధాకర్ అగార్కర్ అన్నారు. మంగళవారం శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా విధానంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏఆర్‌కే రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14 రోజులు రిమాండ్

కిర్లంపూడి: మహిళా మెడలోంచి బంగారు గొలుసు దొంగిలించిన నిందితుడికి మంగళవారం 14 రోజులు రిమాండ్ విధించినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలల ప్రకారం... సోమవరం గ్రామానికి చెందిన 52 ఏళ్ల మహిళ సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన ఇంటి ఎదుట వాకిట్లో ముగ్గు వేస్తోంది. దేవీపట్నం మండలం ఇందుకూరుపేటకు చెందిన ఎన్.వెంకటేశ్(చిన్ని) స్కూటీపై వచ్చి మహిళా మెడలోంచి సుమారు రూ.1.30 లక్షల విలువ చేసే 43 గ్రాముల బరువు గొలుసును అపహరించాడు. దీంతో మహిళ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై.జి సతీష్ కేసు నమోదు చేశారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి పరిసర గ్రామాల్లో సంచరిస్తున్నాడనే విషయం తెలుసుకున్న ఎస్సై సతీష్ తన సిబ్బందితో కిర్లంపూడి ఊరి శివారున తనిఖీలు నిర్వహించి నిందితుడిని పట్టుకున్నారు. అతని నుంచి బంగారు గొలుసు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు కోర్టుకు హాజరుపరిచిన నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు. ప్రత్తిపాడు జైలుకు తరలించారు.



ఏలేశ్వరంలో సిద్ధమైన పూలదండలు, బొకేలు



బవురువాకలో సుందరంగా తీర్చిదిద్దుతున్న రంగవల్లులు



గోకవరంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బొకేలు



తుని జీఎన్‌టీ రోడ్డులో మిఠాయి దుకాణం వద్ద సందడి

నూతన ఉత్సాహం

- న్యూఇయర్ సంబరాలకు సిద్ధం
- గ్రీటింగ్ కార్డులు, వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా సందేశాలు
- పలు చోట్ల వెలసిన పలావు హోటళ్లు
- గ్రామాల్లో సందడి

ఏలేశ్వరం: గతేడాది జ్ఞాపకాలు నెమరవేసుకుంటూ రాబోయే ఏడాదంతా మంచి జరగాలని కోరుకుంటూ నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకొనేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధమవుతున్నారు. దీంతో గ్రామాల్లో సందడి మొదలైంది. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రీటింగ్ కార్డుల దుకాణాలు పిల్లలతో కళకళలాడాయి. స్నేహితులకు, బంధువులకు శుభాకాంక్షలు తెలిపేందుకు గ్రీటింగ్స్ కొనుగోలు చేశారు. అలాగే నాయకులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు గ్రీటింగ్స్ చేప్పేందుకు బోకేలు, పూలదండల దుకాణాలు వెలశాయి. వీటి కొనుగోలు ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో వ్యాపారులు అధిక సంఖ్యలో అందుబాటులో ఉంచారు. దీంతో పాటు 2024నకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ యువకులు ఉత్సాహంగా గడిపారు. మహిళలు తమ ఇళ్ల వద్ద రంగులతో హ్యాపీ న్యూఇయర్‌కు స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు. న్యూఇయర్‌ను పురస్కరించుకుని కేక్‌లు, బోకేలు, రకరకాల రంగులు సిద్ధం చేశారు. పట్టణంలోని ఆర్‌సీఎం, లూథరన్ చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రసార మాధ్యమాల ద్వారా సందేశాలు

కాలాన్ని బట్టి మనుషుల అభిరుచులు మారుతున్నాయి. ఒకప్పుడు న్యూఇయర్ వేడుకల్లో ప్రధాన పాత్ర పోషించే గ్రీటింగ్ కార్డుల డిమాండ్ తగ్గింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాట్సప్, ఫేస్‌బుక్‌ల గ్రీటింగ్స్ చెప్పుకున్నారు. దీంతో యువతంతా రోజంతా సెల్‌ఫోన్లు, కంప్యూటర్స్, లాప్‌ట్యాప్‌లతో బిజీబిజీగా గడిపారు. కాగా ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేసేందుకు ఆలయాలను, చర్చిలను ముస్తాబయ్యాయి.



ఏలేశ్వరంలో ఏర్పాటు చేసిన గ్రీటింగ్ షాపు

గోకవరం: న్యూ ఇయర్ వేడుకలతో మండలంలో సందడి నెలకొంది. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం పలికేందుకు అన్ని సిద్ధం చేశారు. గోకవరంలో పలు రెస్టారెంట్లు నిర్వాహకులు వివిధ రకాల ఆహార పదార్థాలను సిద్ధంగా ఉంచారు. పోటాపోటీగా ఆఫర్లు ప్రకటించడంతో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. కేకులు, పూలు, పండ్లు, స్వీట్స్, బొకేల దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది. మహిళలు తమ ఇళ్ల ముంగిట ముగ్గులు వేస్తూ సందడి చేశారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి.



గోకవరంలో బ్యాకరీలో నూతన సంవత్సరానికి సిద్ధంగా ఉంచిన కేక్‌లు

కొత్త సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం

తుని: పాత జ్ఞాపకాలకు స్వస్తి పలుకుతూ కొత్త సంవత్సరంలో శుభాలు జరగాలని కోరుతూ ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహ భరితంగా మంగళవారం జరుపుకొన్నారు. ఆత్మీయులు, స్నేహితులు, అభిమాన నాయకులు అలా అందరికీ శుభాకాంక్షలు తెలిపేందుకు కొత్త టెక్నాలజీని వినియోగించారు. బేకరీలు, స్వీటు దుకాణాలు, పువ్వుల దుకాణాల్లో సందడి నెలకొంది. బుధవారం అధికారులు, ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు చెప్పడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నూతన సంవత్సర వేడుకులకు అందుబాటులో ఉండడం లేదు. ప్రభుత్వ విప్ యనమల దివ్య, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు సాయివేదికలో నూతన వేడుకులకు పాల్గొంటారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కార్యకర్తలు పర్యవేక్షించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిబంధనలు పాటించక పోతే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడమే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని ఆ పార్టీ నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు. ధర్మవరంలోని ఆయన స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలకు పూర్తి ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ స్థాయిలో పది వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం అల్పాహారం, భోజన సౌకర్యాన్ని కల్పిస్తూ తగు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మురళీరాజు మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ విజయమే తన లక్ష్యం అన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

తొండంగి: నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. దానవాయిపేట, బెండపూడి, తొండంగి, ఏ.కొత్తపల్లి, పెరుమాళ్లపురం తదితర గ్రామాల్లో చర్చిల్లో అర్ధరాత్రి వరకూ క్రైస్తవులంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేకులు కట్ చేసి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కోటనందూరు: నూతన సంవత్సర వేడుకల్లో పోలీసు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై రామకృష్ణ హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్లో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ యువత ట్రిపు ల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలతో ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. మండల వ్యాప్తంగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని, నిబంధనలు అతిక్రమించినట్టు గుర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలంతా సంతోషంగా నూతన సంవత్సన వేడుకలు జరుపుకోవాలని కోరారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

విద్యార్థులకు సన్మానం

ఏలేశ్వరం: ఇటీవల జరిగిన భగవద్గీత పోటీల్లో విజేతలైన విద్యార్థులను పట్టణంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గత నెల ఒకటో తేదీన ఏలేశ్వరంలో మండల స్థాయి, 14న రాజమహేంద్రవరంలో జిల్లాస్థాయి, 25న విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. పోటీల్లో పట్టణానికి చెందిన వెన్నా సత్యసాయివినయ్ రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచాడు. ఇతనితో పాటు మండలస్థాయి, జిల్లాస్థాయిలో విద్యార్థులు రాణించారు. వీరికి పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గావెంకట ప్రసాద్, కటకం కిరిటీ, అనుబంధ దుర్గావాహిని, మాతృశక్తి సంఘాల సభ్యులు స్థానిక ఏలేశ్వరం పబ్లిక్‌స్కూల్‌లో శాలువాలతో సన్మానించి మోమెంటోలు, భగవద్గీత పుస్తకాలు, డిక్షనరీలు అందజేశారు. వీరంతా ఏలేశ్వరం పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు కావడంతో కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని లక్ష్మీని సన్మానించారు. కార్యక్రమంలో మాతృశక్తి, దుర్గావాహిని అధ్యక్షుడు గిరిజాకుమారి, రేవతి, ఉమాదేవి, కె ఇందిరా, పిదేవి, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

శ్రీవారికి నేడు పుష్పయాగం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీపుష్పయాగం, స్వామిఅమ్మవార్లకు పూలంగి సేవలు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. 2025 జనవరి ఒకటి సందర్భంగా స్వామివారిని దర్శించే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల పూలతో పూలంగి సేవ, పుష్పయాగం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల పదిన వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 13న రాత్రి ఏడు గంటలకు గోదారంగనాథుల దివ్య కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

బాల చంద్రారావు సేవలు అభినందనీయం

తుని: స్థానిక ట్రెజరీ కార్యాలయంలో ఎస్‌టీవోగా సేవలందించి పదవీ విరమణ చేసిన కే బాలచంద్రరావు సేవలు అభినందనీయమని తుని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మాధవ రావు అన్నారు. బాల చంద్రరావు పదవీ విరమణ సందర్భంగా మంగళవారం ట్రెజరీ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. విధి నిర్వహణలో ఉద్యోగులు అందించిన సహకారం మరిచిపోలేనని బాల చంద్రరావు అన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆంజనేయ ప్రసాద్, కార్యదర్శి త్రిమూర్తులు, కోశాధికారి కృష్ణ, శర్మ, జోసఫ్, అమల రాజు స్వామి, అప్పలకొండ, కరుణ్‌కుమార్, సూరిబాబు పాల్గొన్నారు.



బాల చంద్రరావును సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అవార్డు గ్రహీతలకు అభినందనలు

తుని: ఇటీవల ఏలూరులో జరిగిన వాకర్స్ కన్వెన్షన్‌లో ఉత్తమ సేవా అవార్డులు పొందిన పలువురిని తుని వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు మంగళవారం అభినందించారు. ఉత్తమ గవర్నర్ చదరం శివాజీ, బెస్ట్ లీడర్ షిఫ్ అవార్డు గ్రహీత కుందెం సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. వాకర్స్ గౌరవ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో వ్యవస్థాపక అధ్యక్షుడు కుందెం సత్యనారాయణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. 2024లో మెడికల్ క్యాంపులు నిర్వహించినందుకు రూ.10 వేల నగదు అవార్డును తుని క్లబ్‌కు లభించిదని గవర్నర్ చదరం శివాజీ తెలిపారు. భవిష్యత్‌లో ప్రజా సేవలను విస్తృతం చేయాలని వక్తలు కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు డీఎస్ మూర్తి, ప్రముఖ న్యాయవాది ఎంవీ సూర్యనారాయణరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కంకిపాటి జమీల్, కండవల్లి డేనియల్ జోసఫ్, వేణుగోపాలస్వామి, శ్రీనివాస్, కె.గౌరీ శంకర్, ధన్యంరాజు సత్యసాయి, బాబు, చిరంజీవి పాల్గొన్నారు.



తునిలో జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

పాఠశాల కమిటీలకు శిక్షణ

గండేపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల యాజమాన్య కమిటీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పి.రమణ, వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల చైర్మన్లు, హెచ్‌ఎంలు ఎం.చినరాజు, వి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు, రీసోర్స్ పర్సన్స్ వీఎస్ భాస్కర్రావు, కె.రమాదేవి, కె.ఈశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

యువత అత్యాశ, అశ్రద్ధ విడాలి

తుని రూరల్: యువత అత్యాశ, అశ్రద్ధలను విడాలని రూరల్ హెడ్‌కానిస్టేబుల్ గౌరీశ్రీ అన్నారు. మంగళవారం లోవకొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టు, గంజాయి, గుట్కా, ఖైనీలతో కలిగే నష్టాలు, యువత భవిష్యత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కనిగిరి విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గౌరీశ్రీ మాట్లాడుతూ నేటి యువత తప్పుదారి పట్టకుండ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, తమ భవిష్యత్‌ను విద్యార్థులే ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నతంగా ఎదగాలన్నారు. విలువైన సమాచారం, సంపద మోసపోవడానికి, నష్ట పోవడానికి ప్రధాన కారణాలు అత్యాశ, అశ్రద్ధలే మూలమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న రూరల్ పోలీసులు

విధుల బహిష్కరణ

ప్రత్తిపాడు: అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ న్యాయవాది బీపీ శేషాద్రి మృతి ముమ్మాటికీ పోలీసుల వైఖరేనని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు అన్నారు. న్యాయవాది మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. కోర్టు ప్రధాన గేటు వద్ద న్యాయవాదులు శేషాద్రి మృతికి కారణమైన సీఐ శాంతిలాల్‌పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొంగుళూరి మధుబాబు, ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ, అవసరాల దేవీ, బార్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

ఘనంగా నారాయణమూర్తి పుట్టినరోజు వేడుకలు

కోటనందూరు: స్థానిక అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ ఆధ్వర్యంలో సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్ నారాయణమూర్తి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నారాయణమూర్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు, తుమాళ్లు, లుంగీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సేవా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలింతలకు ఆకుకూరల పంపిణీ

గోకవరం: స్థానిక సెక్టారు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు సేంద్రియ ఎరువులతో పండించిన ఆకుకూరలను ఉచితంగా పంపిణీ చేశారు. సెక్టార్ పరిధిలో 3, 5, 8 అంగన్‌వాడీ కేంద్రాల్లో 30 సెంట్ల స్థలంలో పోషణవాటిక కార్యక్రమం ద్వారా రసాయన ఎరువులు వాడకుండా ఆకుకూరలను పండిస్తున్నారు. వీటిని మంగళవారం ఎంపీడీఓ గోవిందు చేతుల మీదుగా ఆయా కేంద్రాల్లో బాలింతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరారాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు



కిర్లంపూడి పాఠశాలలో ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



మల్లేపల్లిలో ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈఓ

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో మండల స్థాయిలో మంగళవారం ఏర్పాటు చేసిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. ఎంఈఓలు టీ.జోషఫ్, ఎం.చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనకు 15 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సుమారు 70 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ విభాగం నుంచి తామరాడ జెడ్పీ హైస్కూల్, విద్యార్థుల విభాగం నుంచి కిర్లంపూడి ప్రభుత్వోన్నత పాఠశాల, కిర్లంపూడి విజ్ఞాన భారతి ప్రైవేట్ ఈఎం స్కూల్, గ్రూప్ విభాగం నుంచి కిర్లంపూడి ప్రభుత్వోన్నత పాఠశాల, జగపతినగరం ప్రగతి ఈఎం ప్రైవేట్ పాఠశాల ప్రాజెక్టులు మండల స్థాయిలో ఎంపికైనట్టు తెలిపారు. వీరు జిల్లా స్థాయిలో ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్‌రావు, ప్రభుత్వ జూనియార్ కళాశాల ప్రిన్సిపాల్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

జిల్లా స్థాయికి మూడు ప్రదర్శనలు

గండేపల్లి: విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా జిల్లాస్థాయికి మూడు ప్రదర్శనలు ఎంపికైనట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. మల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ పాఠశాలల నుంచి 22 ప్రదర్శనలు వచ్చాయి. వీటిలో నాయకంపల్లి హైస్కూల్ నుంచి డి.సత్య కుమార్ స్వామి, గండేపల్లి హైస్కూల్ జి.లోకేష్, వి.మధుమోహన్, యల్లమిల్లి పాఠశాల నుంచి వి.వి.రత్నం ఎంపికైనట్టు తెలియజేశారు. జిల్లా స్థాయి ఎంపికైన ప్రదర్శనలు ఈనెల 3న కాకినాడలో జరిగే ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కనిగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.